# పంజాబ్, హర్యానా రైతాంగంపై మోడీ ప్రభుత్వ అమానుష నిర్బంధకాండను నిరసించండి

# పోలీసు కాల్పులలో రైతు ప్రాణం బలిగొన్న క్రూర మారణకాండను ఖండించండి



ఢిల్లీ సరిహద్దుల్లో రైతాంగంపై బిజెపి ప్రభుత్వ దమనకాండ

**పంజాబ్,** హర్యానా, ఉత్తర భారత రైతాంగం మరోసారి తమ పంట పొలాలను వదిలిపెట్టి వీధుల్లోకి రావలసి వచ్చింది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కోసం, రైతు రుణాల మాఫీ కోసం, ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలమైన తర్వాత, ఫిబ్రవరి 13న ముందుగా ప్రకటించిన విధంగా 'చలో ఢిల్లీ'కి రైతు సంఘాలు పిలుపునిచ్చాయి. వేలాది మంది రైతాంగం పంజాబ్ నుండి హర్యానా సరిహద్దు వద్దకు చేరుకోగానే హర్యానాలోని బిజెపి ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో నిరాయుధులై, శాంతియుతంగా ఢిల్లీ చేరాలని బయలుదేరిన రైతాంగాన్ని అడ్డుకోవడానికి, అసలు ఢిల్లీ గడప తొక్కకుండా చేయడానికి, కాంక్రీట్ దిమ్మలు, ఇనప కంచెలతో, భారత–పాకిస్తాన్ సరిహద్దులను మూసేసిన విధంగా మూసివేసి ఉంచారు. హర్యానా సరిహద్దులకు చేరుకున్న రైతాంగంపై శంభూ వద్ద, కసునూరు వద్ద రెండు సరిహద్దు ప్రాంతాల్లో కేంద్ర సాయుధ బలగాలు, హర్యానా రాష్ట్ర పోలీసులు మోహరించి రైతులపై దాడులు చేశారు. డ్రోన్‌ల సహాయంతో రైతాంగంపై భాష్పవాయు తూటాలు ప్రయోగించారు. నీళ్ళ ట్యాంకులతో రైతులపై విరుచుకుపడ్డారు. వందలాదిగా రైతాంగం, విలేఖరులు ఈ అమానుష దాడుల్లో గాయాల పాలయ్యారు.

సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వాన 2021లో దాదాపు 18 నెలలపాటు రైతాంగం పోరాడారు. 700 మంది ప్రాణత్యాగం చేశారు. ఫలితంగా మూడు నల్ల చట్టాలను రద్దు చేస్తున్నట్టు మోడీ ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితుల్లో ప్రకటించింది. పంటల మద్దతు ధరల అంశమై ఉన్నత స్థాయి కమిటీని నియమించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. కానీ పంటల కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించే విషయంలో కేంద్ర ప్రభుత్వం ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. నాటి ఆందోళనలో రైతులపై పెట్టిన అక్రమ కేసులనూ, ముఖ్యంగా లఖింపూర్ ఖేరి వంటి చోట్ల రైతులపై కార్లను తోలిన బిజెపి నాయకుల దౌర్జన్యాలను వ్యతిరేకించినందుకు రైతులపై పెట్టిన కేసులను ఇంకా రద్దు చేయలేదు.

పైపెచ్చు మూడు నల్ల చట్టాలను దొడ్డిదారిన మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్నది. రైతాంగ ఉద్యమ తదనంతరం కూడా గిట్టుబాటు ధరలు లభించక రైతులు, కౌలు రైతులూ బలవన్మరణాలకు పాల్పడుతూనే ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆహార ఉత్పత్తి క్రమాన్ని, వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరించడానికి, విదేశీ స్వదేశీ దళారీలపరం చేయడానికి చర్యలు తీసుకుంటూనే ఉంది. సెంట్రల్ వేర్‌హౌస్ గోడౌన్లను ఆదానీలకు అప్పగిస్తున్నది. ఇలాంటి పరిస్థితుల్లో రైతాంగం మరో పర్యాయం వీధుల్లోకి రావడం తప్ప మరో మార్గం లేకపోయింది.

స్వామినాధన్‌కు 'భారతరత్న' అవార్డు ఇచ్చింది, ఎన్నికల ఓట్ల కోసం తప్ప – ఆ స్వామినాధన్ కమిషన్ చేసిన సిఫార్సులను అమలుచేయడం కోసం కాదని, బిజెపి పాలకులు పంజాబ్, హర్యానా రైతులపై ఎత్తిన లాఠీలతో నిరూపించారు.

**రైతులపై యుద్ధం ప్రకటించిన బిజెపి ప్రభుత్వం–ఫిబ్రవరి 21న హర్యానా సరిహద్దు ల్లోని ఖనోరి వద్ద 21 ఏళ్ళ రైతు బిడ్డ శుభ్ కిరణ్ సింగ్‌ను అమానుషంగా కాల్చి చంపింది.** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, హర్యానా రాష్ట్రంలోని డబల్ ఇంజన్ ప్రభుత్వాలు సాగిస్తున్న డబల్ అమానుషత్వానికి నిదర్శనం ఈ దారుణం. చలో ఢిల్లీ కార్యక్రమానికి కదిలిన వేలాది మంది రైతులను హర్యానా సరిహద్దుల్లో నిలిపివేసి, రైతులపైనే యుద్ధాన్ని ప్రకటించిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరులో ఇది మరొక ఉదాహరణ. మరోపక్క రోడ్లపై మేకులు కొడుతూ, డ్రోన్లతో టియర్ గ్యాస్ తూటాలు విడుస్తూ, రబ్బర్ బుల్లెట్లతో కాలుస్తూ, శబ్ద, జల యంత్రాలతో రైతులపైనే ప్రభుత్వం యుద్ధం సాగిస్తున్నది.

ఈ అమానుష అణిచివేతను, నిర్బంధ కాండను తీవ్రంగా ఖండించమని, గిట్టుబాటు ధరలకు చట్టబద్ధత కోసం, రైతు రుణాల మాఫీ కోసం, విద్యుత్ చట్టాల సవరణ కోసం రద్దు కోసం ఉద్యమించాలని రైతాంగాన్ని, యావత్ ప్రజానీకం కోరుతున్నాము.

**ఎస్ ఝాన్సీ, అధ్యక్షులు**

**రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్)**

**(ఏ ఐ కె ఎం కె ఎస్ అనుబంధం)**